

అట్టహాసంగా సాఫ్ట్‌బాల్ పోటీలు
జిల్లా కేంద్రంలో రాష్ట్రస్థాయి అండర్-17 బాలబాలికల సాఫ్ట్‌బాల్ పోటీలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్ జెండా ఊపి ప్రారంభించారు. 8లో▸



పాఠశాలల్లో గణిత దినోత్సవం
జిల్లా వ్యాప్తంగా విద్యాసంస్థల్లో గణిత దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. విద్యార్థులకు వివిధ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. 9లో▸

గరిష్ఠం/కనిష్ఠం
30.0 / 14.0

వాతావరణం
సాధారణ ఉష్ణోగ్రతలు నమోదవుతాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. చలి తీవ్రత కాస్త పెరుగుతుంది. రాత్రివేళ పొగమంచు కురుస్తుంది.

న్యూస్‌రీల్

సమస్యలు లేకుండా చూడాలి



రికార్డులు పరిశీలిస్తున్న కిశోర్‌కుమార్

లోకేశ్వరం: గ్రామాల్లో భూసమస్యలు లేకుండా చూడాలని అదనపు కలెక్టర్ కిశోర్‌కుమార్ సూచించారు. శుక్రవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ధరణి రికార్డులు, పహాణీలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ధరణిలో ఎలాంటి సమస్యలున్నా తన దృష్టికి తీసుకురావాలని సూచించారు. ఆధార్ కేంద్రంలో లబ్ధిదారులకు ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. తహసీల్దార్ మోతీరాం, డీటీ రవీందర్ ఉన్నారు.

అధ్యాపకుడికి అభినందనలు



రామారావును అభినందిస్తున్న వెంకటరమణ

భైంసా: బాసర ట్రిపుల్‌ఐటీ అధ్యాపకుడు డాక్టర్ శీలం రామారావుకు ఇటీవల ఉస్మానియా విశ్వవిద్యాలయం డాక్టరేట్ ప్రదానం చేయగా శుక్రవారం ఆర్జీయూకేటీ కాన్ఫరెన్స్ హాల్‌లో వీసీ వెంకటరమణ అభినందించారు. ఎంతో మంది ట్రిపుల్‌ఐటీ అధ్యాపకులు డాక్టరేట్ సాధించడం గర్వించదగ్గ విషయమని తెలిపారు.

'ఇథనాల్' వద్దంటూ రాస్తారోకో



రాస్తారోకో చేస్తున్న గ్రామస్తులు

దిలావర్‌పూర్: దిలావర్‌పూర్, గుండంపల్లి గ్రామాల మధ్య నిర్మిస్తున్న ఇథనాల్ కర్మాగారాన్ని నిలిపివేయాలంటూ న్యూలోలం గ్రామస్తులు శుక్రవారం నిర్మల్–భైంసా రహదారిపై రాస్తారోకో చేశారు. అరగంట పాటు బైఠాయించడంతో రోడ్డుకిరువైపులా వాహనాలు నిలిచి ట్రాఫిక్ అంతరాయమేర్పడింది. పోలీసులు అక్కడకు చేరుకుని ఆందోళనకారులతో రాస్తారోకో విరమింపజేశారు. కాగా, వెంటనే ఇథనాల్ కర్మాగార నిర్మాణాన్ని నిలిపివేయాలని నాయకులు మంద మల్లేశ్, ఒడ్నం కృష్ణ డిమాండ్ చేశారు.

క్రీడల్లోనూ రాణించాలి

నిర్మల్‌టౌన్: విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లోనూ రాణించాలని జిల్లా క్రీడల శాఖ అధికారి నాఫేఖాన్, డీపీఆర్వో తిరుమల సూచించారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని డిగ్రీ కళాశాల మైదానంలో జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో 19వ నేషనల్ ఇంటర్ జిల్లా జూనియర్ అథ్లెటిక్స్ మీట్ నిర్వహించారు. అండర్–14, 16 బాలబాలికల విభాగంలో లాంగ్‌జంప్, షార్ట్‌పుట్ తదితర అంశాల్లో పోటీలు నిర్వహించి విజేతలకు సర్టిఫికెట్లు, మెడల్స్ అందజేశారు. కార్యక్రమంలో జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ కార్యదర్శి శ్యాముల్, వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ముగిసిన ఖోఖో పోటీలు

- విజేతగా నిలిచిన ఉమ్మడి ఆదిలాబాద్



విజేతలకు ట్రోఫీ అందజేస్తున్న అధికారులు

ఆసిఫాబాద్‌రూరల్: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలోని గిరిజన బాలికల ఆదర్శ క్రీడామైదానంలో నిర్వహిస్తున్న 67వ రాష్ట్రస్థాయి అండర్–14 బాలబాలికల ఖోఖో పోటీలు ముగిశాయి. శుక్రవారం జరిగిన సెమీ ఫైనల్స్, ఫైనల్స్‌లో ఉమ్మడి జిల్లా జట్ల మధ్య మ్యాచ్‌లు హోరాహోరీగా సాగాయి. బాలుర ఫైనల్స్‌లో ఆదిలాబాద్ జట్టు విజయం సాధించగా.. రన్నరప్‌గా రంగారెడ్డి, మూడోస్థానంలో మెదక్ జట్టు నిలిచింది. అలాగే బాలికల ఫైనల్స్‌లో ఆదిలాబాద్ జట్టు గెలుపొందగా.. రన్నరప్‌గా మెదక్, తృతీయ స్థానంలో ఖమ్మం జట్టు నిలిచింది. విజేతలకు డీటీడీవో రమాదేవి, ఐటీడీఏ(పీవీటీజీ) ఏపీవో భాస్కర్, ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా స్పోర్ట్స్ అధికారి పార్థసారథి బహుమతులు ప్రదానం చేశారు. కాగా.. ప్రథమ స్థానంలో ఉన్న ఉమ్మడి జిల్లా జట్టు నుంచి నలుగురు, ద్వితీయస్థానంలో ఉన్న జట్టు నుంచి ముగ్గురు, మూడు, నాలుగో స్థానాల్లో నిలిచిన జట్ల నుంచి ఒక్కో ప్లేయర్‌ను జాతీయస్థాయి పోటీలకు ఎంపిక చేస్తామని అధికారులు తెలిపారు. ఎంపికైన వారికి కుమురంభీం జిల్లా కేంద్రంలో శిక్షణ ఉంటుందని వారు పేర్కొన్నారు. కార్యక్రమంలో డీఎస్వో మీనారెడ్డి, ఏసీఎంవో ఉద్ధవ్, ఎస్జీఎఫ్ జిల్లా కార్యదర్శి సాంబశివరావు, జీసీడీవో శకుంతల, హెచ్‌ఎం కృష్ణారావు, సీజీఎఫ్‌ఎం రమేశ్, సంధ్య, మల్లేశ్, పీఈటీలు మధుసూదన్, విద్యాసాగర్, అరవింద్ ఉన్నారు.

రైతుబంధు రాలే..



లోకేశ్వరం: మండల కేంద్రంలో వరి నాటు వేస్తున్న కూలీలు

- ఎకరంలోపు రైతులకే డబ్బులు జమ
- జిల్లా రైతుల ఖాతాల్లో రూ.15 కోట్లు
- ఎకరం.. ఆపై ఉన్న రైతులకు అందలే..
- రబీ సాయానికి రైతన్నల ఎదురుచూపు

భైంసాటౌన్: 'అన్నా.. రైతుబంధు పడ్డదానే..! నాకైతే ఇప్పటిదాక రాలే.. నీకేమన్నా వచ్చిందా..? ఎకరం లోపట భూమి ఉన్నోళ్లకు పడ్డయంటున్నరు.. అవునా..!' అంటూ జిల్లాలో ఏ ఇద్దరు రైతులు కలిసినా ఇప్పుడు ఇలాగే మాట్లాడుకుంటున్నారు. ఎందుకంటే రాష్ట్ర ప్రభుత్వం యాసంగికి సంబంధించి ఇప్పటివరకు పెట్టుబడి సాయం జమ చేయలేదు. దీంతో తోటి రైతుల వద్ద ఆరా తీస్తున్నారు. గత ప్రభుత్వం అందించినట్లే ఈ యాసంగికి ఎకరానికి రూ.5వేలు సాయమందిస్తామని ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటించింది. కాగా, ఎకరంలోపు ఉన్న రైతుల్లో కొందరి బ్యాంక్ ఖాతాల్లో నగదు జమవుతుండగా, తమకు ఎప్పుడు అందుతాయోనని మిగతా రైతులు ఎదురుచూస్తున్నారు.

ఎకరంలోపు ఉన్నవారికే..

జిల్లాలో రైతుబంధు లబ్ధిదారులు 1.96లక్షల మంది ఉన్నారు. వీరికి ప్రతీ సీజన్‌లో రూ.235 కోట్ల పెట్టుబడి సాయం అందుతోంది. గత నెలలోనే పెట్టుబడి సాయం అందాల్సి ఉండగా ఎన్నికల నేపథ్యంలో వివిధ కారణాలతో నిలిచిపోయింది. ప్రస్తుతం అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం రైతుబంధు సాయం రైతుల ఖాతాల్లో జమ చేస్తోంది. కాగా, ఎకరంలోపు ఉన్న రైతులకు మాత్రమే ప్రస్తుతం ఖాతాల్లో డబ్బు జమవుతుండటంతో మిగతా రైతులు సాయం కోసం నిరీక్షిస్తున్నారు. జిల్లాలో ఇప్పటివరకు దాదాపు 15వేల మంది రైతులకు రూ.15కోట్ల వరకు పెట్టుబడి సాయానికి సంబంధించిన నగదు ఖాతాల్లో జమైనట్లు సంబంధిత అధికారులు చెబుతున్నారు. వీరిలో ఎక్కువమంది ఎకరంలోపు ఉన్నవారే. ఇంకా, రెండు, మూడెకరాలు ఉన్న చిన్న, సన్నకారు రైతులు కూడా అధికసంఖ్యలోనే ఉంటారు. ఈ నేపథ్యంలో వీరికి ప్రభుత్వం అందించే పెట్టుబడి సాయమే ఆధారం. దీంతో రైతుబంధు సాయం ఎప్పుడు అందుతుందోనని వారు అధికారులు, బ్యాంకుల చుట్టూ తిరుగుతున్నారు.

జిల్లా వివరాలు

రైతుబంధు లబ్ధిదారులు:	1,96,471
అందాల్సిన సాయం:	రూ.235.52 కోట్లు
ఖరీఫ్‌లో లబ్ధిపొందిన రైతులు:	1,83,977
అందిన పెట్టుబడి సాయం:	రూ.227.09 కోట్లు
కొత్తగా నమోదు చేసుకున్నవారు:	7,121
వీరికి అవసరమైన నగదు:	1.83 కోట్లు

నిధులు విడుదల చేయాలి

యాసంగి సాగు పనులు చేపట్టిన రైతులు రైతుబంధు సాయం కోసం ఎదురుచూస్తున్నారు. ప్రభుత్వం ఎకరంలోపు రైతులకే పెట్టుబడి డబ్బులు జమ చేసింది. మిగతా వారికి వెంటనే పెట్టుబడి డబ్బులు జమ చేయాలి. సకాలంలో రైతులకు సాయమందకుంటే వడ్డీ వ్యాపారులను ఆశ్రయించి తీవ్రంగా నష్టపోతారు. – సంగెపు బొర్రన్న, రైతు స్వరాజ్య వేదిక జిల్లా అధ్యక్షుడు

ఇప్పటివరకు జమ కాలేదు



యాసంగి రైతుబంధు సాయం ఇంకా అందలేదు. ఎకరంలోపున్న రైతులకే పడ్డయంటున్నరు. యాసంగి సాగు పనులు మొదలైనా ఇంకా పడకుంటే ఎట్ల. వెంటనే రైతుబంధు కింద పెట్టుబడి సాయం అందించి ఆదుకోవాలి.
– మొహియొద్దీన్, భైంసా

సకాలంలో అందించాలి



నాకు ఐదెకరాల భూమి ఉంది. యాసంగి కోసం మక్క సాగుకు సిద్ధమైన. ఇప్పటిదాకా రైతుబంధు డబ్బులు రాలేదు. ఎకరంలోపు ఉన్నోళ్లకే సర్కార్ డబ్బులు జమ చేసిందట. మాకూ సకాలంలో అందిస్తే ప్రయోజనముంటది.
– గజేందర్, కుంటాల

16 గుంటలే ఉన్నా రాలే



లోకేశ్వరం: నాకు 16 గుంటల భూమి మాత్రమే ఉంది. అంతకుముందు రైతుబంధు పైసలు ఖాతాల పడ్డయ్. కొత్త సర్కారు ఎకరంలోపు రైతులకు రైతుబంధు పైసలు జమ చేసిందట. నాకు కూడా పెట్టుబడి సాయం జమ చెయ్యాలె.
– దడిగే భోజవ్వ, వట్టోలి, లోకేశ్వరం మండలం

'కేంద్రం'.. ప్రచార యాత్ర!



ఖానాపూర్: ఎర్వచింతల్ గ్రామంలో అవగాహన కల్పిస్తున్న అధికారులు

- సర్కారు పథకాలపై విస్తృత ప్రచారం
- ఉమ్మడి జిల్లాలో ప్రధానమంత్రి భారత్ వికసిత్ సంకల్ప్ యాత్ర
- లోక్‌సభ ఎన్నికలకు ముందు బీజేపీ సర్కారు పథకాలపై అవగాహన
- లబ్ధి పొందేందుకు ప్రయత్నాలు

సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: లోక్‌సభ ఎన్నికలకు ముందు బీజేపీ కేంద్ర ప్రభుత్వ పథకాలపై ప్రత్యేక దృష్టి సారించింది. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తూ ప్రయోజనం పొందేలా 'ప్రధానమంత్రి భారత్ వికసిత్ సంకల్ప్ యాత్ర' పేరిట విస్తృత ప్రచారం చేస్తోంది. ప్రతీ గ్రామంలో ప్రత్యేక ప్రచార రథాలపై ప్రజలకు ప్రచారం కల్పిస్తున్నారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో రెండు లోక్‌సభ స్థానాలు, పది అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో మొత్తం 1,510 గ్రామ పంచాయతీల్లో ప్రచార యాత్ర నిర్వహిస్తున్నారు. ప్రతీ శాసనసభ నియోజకవర్గ పరిధిలో ఓ ప్రచార రథం ఏర్పాటు చేశారు. ఎల్‌ఈడీ తెరపై వీడియోలు ప్రదర్శిస్తూ కరపత్రాలు, కొత్త సంవత్సర కేలండర్లు అందిస్తున్నారు. ఒకరోజుకు కనీసం రెండు గ్రామ పంచాయతీల చొప్పున వచ్చే జనవరి 26నాటికి ప్రచారం పూర్తి చేసేలా అధికారులు ఏర్పాట్లు చేశారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా గత నెల 16న యాత్ర ప్రారంభించగా.. మరో 35రోజులపాటు కొనసాగుతుంది. స్థానిక పంచాయతీ, గ్రామీణాభివృద్ధి, వ్యవసాయ, ఇతర అధికారులు, బీజేపీ ఎమ్మెల్యేలు, నాయకులు కేంద్ర ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని కోరుతున్నారు.

18 పథకాలపై అవగాహన

కేంద్ర ప్రభుత్వం అనేక పథకాలు అమలు చేస్తున్నా.. చాలామంది రాష్ట్ర ప్రభుత్వ పథకాలుగానే భావిస్తుంటారు. దీంతో బీజేపీ ప్రభుత్వం గత తొమ్మిదిన్నరేళ్లలో అమలు చేస్తున్న పథకాలను అందరికీ తెలియజేసేందుకు వికసిత్ సంకల్ప్ యాత్ర చేపట్టారు. ఈ యాత్రలో మొత్తం 18 కేంద్ర ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలపై వివరిస్తున్నారు. ప్రధానంగా గరీబ్ కల్యాణ్, అన్న యోజన, దీన్ దయాళ్ అంత్యోదయ, జాతీయ గ్రామీణ ఉపాధి మిషన్, ఉజ్వల, ప్రధానమంత్రి కిసాన్ సమ్మాన్ నిధి, ఆయుష్మాన్ భారత్, ప్రధానమంత్రి ఎంప్లాయిమెంట్ గ్యారంటీ ప్రోగ్రాం, అటల్ పింఛన్, పీఎం ఉజ్వల యోజన, పీఎం ఫసల్ బీమా, ప్రధానమంత్రి ఆవాస్, కిసాన్ క్రెడిట్ కార్డులు, ముద్ర లోన్లు, ప్రధానమంత్రి విశ్వకర్మ, సురక్ష బీమా, జీవన్‌జ్యోతి బీమా యోజనపై అందరికీ అర్థమయ్యేలా అవగాహన కల్పిస్తున్నారు. ఎవరైనా లబ్ధిదారులు ఆయా పథకాలకు దరఖాస్తు చేసుకునేందుకు ఆ ప్రచార రథం వద్దే ఫారాలు నింపి అందజేసే అవకాశం ఇస్తున్నారు. ప్రధానమంత్రి విశ్వకర్మ యోజన కింద అర్హులైన చేతివృత్తుల వారికి యూనిట్లు అందించేందుకు ఎంపిక కోసం దరఖాస్తులు స్వీకరిస్తున్నారు.

బీజేపీ బలం పెంచేందుకు..

దేశంలో సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో బీజేపీ ప్రభుత్వం తమ పథకాల అమలుతో వచ్చే ఎన్నికల్లో లబ్ధి పొందేందుకు ప్రయత్నాలు చేస్తోంది. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో రెండు లోక్‌సభ స్థానాలైన ఆదిలాబాద్ పరిధిలో నిర్మల్, ముథోల్, ఖానాపూర్, బోథ్, ఆదిలాబాద్, ఆసిఫాబాద్, సిర్పూర్ నియోజకవర్గాలు, పెద్దపల్లి పరిధిలో ఉన్న మంచిర్యాల, చెన్నూరు, బెల్లంపల్లి సెగ్మెంట్లలో పార్టీ బలాన్ని పెంచేందుకు ఈ ప్రచార రథాలు ఉపయోగపడుతాయని ఆ పార్టీ నాయకులు భావిస్తున్నారు. తొలిసారిగా 2019 ఎన్నికల్లో బీజేపీ నుంచి ఎంపీగా సోయం బాపూరావు గెలుపొందారు. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో అనూహ్యంగా నిర్మల్, ముథోల్, ఆదిలాబాద్, సిర్పూర్ నియోజకవర్గాలు మొత్తంగా నాలుగు చోట్ల కాషాయ జెండా ఎగురవేసింది. ఇదే ఊపుతో వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో సత్తా చాటాలంటే గ్రామస్థాయిలో ప్రభుత్వ పథకాల అమలు, లబ్ధిదారులతో బలం పెంచేందుకు ఈ కార్యక్రమాలు చేపడుతున్నారు. ఈ క్రమంలో స్థానిక బీజేపీ నాయకులు కూడా పాల్గొని యాత్ర విజయవంతానికి కృషి చేస్తున్నారు.

'మత్తు పదార్థాలకు బానిసలు కానివ్వొద్దు'



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్

నిర్మల్‌చైన్‌గేట్: యువత మత్తు పదార్థాలు, మాదక ద్రవ్యాలకు బానిసలు కాకుండా చర్యలు చేపట్టాలని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని మినీ సమావేశ మందిరంలో ఎస్పీ ప్రవీణ్‌కుమార్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్‌తో కలిసి నార్కోటిక్ కంట్రోల్ కోఆర్డినేషన్ కమిటీయాక్షన్ ప్లాన్‌పై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లాలో గంజాయి నిరోధానికి ప్రత్యేక చర్యలు చేపట్టాలన్నారు. విద్యాసంస్థల్లో డ్రగ్స్ కమిటీలు ఏర్పాటు చేసి వారానికోసారి సమావేశాలు నిర్వహించి విద్యార్థులకు అనర్థాలపై అవగాహన కల్పించాలని సూచించారు. అన్ని వర్గాలవారికి అవగాహన కల్పించి నిర్మల్‌ను డ్రగ్స్ రహిత జిల్లాగా రూపొందించాలని తెలిపారు. ఎస్పీ ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ.. రైతులు పంట చేలల్లో గంజాయి మొక్కలు పెంచకుండా వ్యవసాయశాఖ అధికారులు పర్యవేక్షించాలని ఆదేశించారు. గంజాయి మొక్కలు పెంచే రైతులకు రైతుబంధు, రైతుబీమా పథకాలు అందవని పేర్కొన్నారు. జిల్లా సరిహద్దు ప్రాంతాల నుంచి మత్తు పదార్థాలు రాకుండా గట్టి నిఘా ఏర్పాటు చేయాలని సూచించారు. జిల్లాలో డ్రగ్స్‌ను అరికట్టేందుకు పోలీస్, రెవెన్యూ, ఫారెస్ట్, ఎక్సైజ్, వ్యవసాయశాఖలు సంయుక్తంగా పనిచేసి, ఎలాంటి సమాచారం అందినా వెంటనే పోలీస్ శాఖకు తెలుపాలని కోరారు. ఏఎస్పీ కాంతిలాల్ పాటిల్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

నూతన నియామకం

భైంసాటౌన్: తెలంగాణ ఎస్సీ, ఎస్టీ గజిటెడ్ అధ్యాపకుల సంఘం రాష్ట్ర ప్రచార కార్యదర్శిగా భైంసా ప్రభుత్వ జూనియర్ కళాశాల అధ్యాపకుడు రొండి రామచంద్రం నియమితులయ్యారు. కాగా, తన నియామకానికి సహకరించిన రాష్ట్ర అధ్యక్షుడు బరిగెల నారాయణ, ప్రధాన కార్యదర్శి గొంటి రవికి రామచంద్రం కృతజ్ఞతలు తెలిపారు. సంఘం అభివృద్ధికి కృషి చేస్తానని ఈ సందర్భంగా పేర్కొన్నారు.

ఆర్‌ఎంపీ, పీఎంపీల కార్యవర్గం



నూతన కార్యవర్గ సభ్యులు వీరే..

నిర్మల్‌చైన్‌గేట్: ఆర్‌ఎంపీ, పీఎంపీల జిల్లా కార్యవర్గాన్ని శుక్రవారం జిల్లా కేంద్రంలోని టీఎన్జీవోస్ భవన్‌లో ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు స్టేట్ కౌన్సిల్ సభ్యుడు ఆశమొల్ల మోహన్ తెలిపారు. అధ్యక్షుడిగా సురగంటి భోజారెడ్డి, ఉపాధ్యక్షులుగా దొంతుల చంద్రశేఖర్, తునికి మహేందర్, కార్యదర్శిగా అమ్ముల సాగర్, సహాయ కార్యదర్శిగా గంధం పోశెట్టి, కోశాధికారులుగా మేకల నవీన్‌యాదవ్, ఈర్ల సాగర్, సహాయ కోశాధికారిగా పోశెట్టిని ఎన్నుకున్నట్లు పేర్కొన్నారు.

ఎంపీలపై సస్పెన్షన్ ఎత్తివేయాలని ధర్నా



భైంసాటౌన్: నిరసన తెలుపుతున్న నాయకులు

నిర్మల్‌చైన్‌గేట్: ఈ నెల 13న పార్లమెంట్‌లో భద్రత ఉల్లంఘన ఘటనపై ప్రతిపక్ష ఎంపీలను బీజేపీ ప్రభుత్వం సస్పెండ్ చేయడాన్ని నిరసిస్తూ జిల్లా కేంద్రంలోని ఆర్డీవో కార్యాలయం ఎదుట కాంగ్రెస్ ఆధ్వర్యంలో శుక్రవారం ధర్నా చేశారు. కేంద్ర ప్రభుత్వానికి, ప్రధాని మోదీకి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అనంతరం ఆర్డీవో కార్యాలయ సిబ్బందికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. దేశ చరిత్రలో 143 మంది పార్లమెంట్ సభ్యులను ఎప్పుడూ లేని విధంగా సస్పెండ్ చేయడం సిగ్గుచేటన్నారు. ఈ విధానాన్ని ఖండిస్తున్నామని, దేశంలో ఎమర్జెన్సీ విధించినట్లు తెలుస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వం పార్లమెంట్‌ను సొంత పార్టీ ఆఫీస్‌గా వాడుకుంటోందని ఆరోపించారు. బిల్లులు, చట్టాలపై చర్చ లేకుండా ఏకపక్షంగా బీజేపీ తీసుకుంటున్న నిర్ణయాలు సరికాదని పేర్కొన్నారు. ప్రతిపక్ష ఎంపీలను సస్పెండ్ చేసి బిల్లు పాస్ చేసుకోవడం దురదృష్టకరమని తెలిపారు. వెంటనే సభ్యులపై సస్పెన్షన్ ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సారంగపూర్ జెడ్పీటీసీ సభ్యుడు పత్తిరెడ్డి రాజేశ్వర్‌రెడ్డి, న్యాయవాది మల్లారెడ్డి, నాయకులు రవి, గణేశ్ తదితరులు పాల్గొన్నారు.

'ప్రజాస్వామ్యం గొంతు నొక్కడమే'

భైంసాటౌన్: పార్లమెంట్‌లో దుండగుల దాడిని నిరసిస్తూ రక్షణ వ్యవస్థపై ప్రశ్నించిన విపక్ష ఎంపీలపై సస్పెన్షన్ వేటు వేయడం ప్రజాస్వామ్యం గొంతు నొక్కడమేనని కాంగ్రెస్ నాయకులు ఆరోపించారు. పట్టణంలోని బస్టాండ్ ఎదురుగా గల అంబేద్కర్ విగ్రహం ఎదుట నిరసన తెలిపారు. వెంటనే విపక్ష ఎంపీలపై సస్పెన్షన్ ఎత్తివేసి, వారికి క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. అనంతరం ఆర్డీవో కార్యాలయంలో మెమోరాండం అందజేశారు. నాయకులు సింధే ఆనంద్‌రావు పటేల్, శంకర్ చంద్రే, అష్ఫద్ షేక్, భూమన్న తదితరులున్నారు.

ముగిసిన భవన నిర్మాణ కార్మికుల శిక్షణ

భైంసాటౌన్: పట్టణంలో కార్మికశాఖ, నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్ ఆధ్వర్యంలో చేపట్టిన భవన నిర్మాణ కార్మికుల శిక్షణ తరగతులు శుక్రవారం ముగిశాయి. ఎలక్ట్రీషియన్ విభాగంలో 30మందికి 15రోజులపాటు శిక్షకుడు రమేశ్ ఆధ్వర్యంలో శిక్షణ ఇచ్చారు. శిక్షణ కాలంలో కార్మికులకు రోజుకు రూ.300 చొప్పున స్టైఫండ్‌తోపాటు శిక్షణ పూర్తిచేసుకున్నవారికి ధ్రువీకరణపత్రం ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు.

'ముక్కోటి'కి ముస్తాబు

- ఉత్తర ద్వార దర్శనానికి సిద్ధమైన జిల్లాలోని వైష్ణవాలయాలు

నిర్మల్: ఏడాదికోసారి ముక్కోటి ఏకాదశి పర్వదినాన నారాయణుడు ఉత్తర ద్వారాన దర్శనమిస్తాడు. వైకుంఠద్వారంగా పిలిచే ఈ ద్వారం ద్వారానే ఆలయంలోకి అడుగుపెట్టి స్వామిని భక్తులు దర్శించుకుంటారు. లక్ష్మీనారాయణుడికి ఇష్టమైన శనివారమే ముక్కోటి ఏకాదశి రావడంతో వైష్ణవాలయాలకు భక్తులు పోటెత్తనున్నారు. జిల్లాకేంద్రంలో 450 ఏళ్ల నాటి చారిత్రక దేవరకోట శ్రీలక్ష్మీవేంకటేశ్వర స్వామి దేవాలయం ప్రముఖమైంది. ఇక్కడి స్థలమహిమ ఆధారంగా నిమ్మనాయుడికాలంలో ఈ ఆలయాన్ని నిర్మించారు. ఉత్తర ద్వారాన దర్శనం చేసుకునేందుకు ఇక్కడికి వేలాదిగా భక్తులు వస్తుంటారు. ఈమేరకు ఆలయ కమిటీ, దేవాదాయశాఖ అధికారులు ఏర్పాట్లు పూర్తిచేశారు. ఉత్తరద్వారం వద్ద టెంట్లు, క్యూలైన్లు ఏర్పాటు చేశారు. ఆలయాన్ని పూలు, లైట్లతో అలంకరించారు. కుభీర్ మండలకేంద్రంలోనూ నాలుగువందల ఏళ్ల కిందటి విఠలేశ్వరాలయం ప్రత్యేక పూజలకు సిద్ధమైంది. ఖానాపూర్ పట్టణంలోని మెట్‌పల్లిరోడ్డులో గల లక్ష్మీవేంకటేశ్వరస్వామి, భైంసా పట్టణంలోని సునార్‌గల్లీలో గల పద్మావతివేంకటేశ్వరస్వామి, లక్ష్మణచాంద మండలంలోని అష్టభుజ వేణుగోపాలస్వామి, దిలావర్‌పూర్ మండలంలోని కాల్వ లక్ష్మీనర్సింహస్వామి, తానూరు విఠలేశ్వరాలయం తదితర ఆలయాలను ముక్కోటి ఏకాదశికి ముస్తాబు చేశారు.



ముస్తాబైన నిర్మల్‌లోని దేవరకోట ఆలయం



కుభీర్‌లోని చారిత్రక విఠలేశ్వరాలయం



ఖానాపూర్‌లోని లక్ష్మీ వేంకటేశ్వరస్వామి ఆలయం

వైభవంగా సాయి పారాయణోత్సవం



వేడుకల్లో బాబావేషధారణలో లక్ష్మణ్, భక్తులు

నిర్మల్‌ఖిల్లా: జిల్లాకేంద్రం శివారులోని గండి రామన్న క్షేత్రంలో కొలువైన షిరిడీ సాయినాథుడి ఆలయంలో సాయి పారాయణోత్సవాలు కొనసాగుతున్నాయి. దత్త జయంతిని పురస్కరించుకుని ఈ నెల 19న ప్రారంభమైన మహాసాయి పారాయణ కార్యక్రమం 25వ తేదీ వరకు కొనసాగనుంది. శుక్రవారం ఉదయం ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు అధికసంఖ్యలో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు. భక్తుడు లక్ష్మణ్ సాయి బాబా వేషధారణలో ఆకట్టుకున్నారు. సాయినాథుడే తమ చెంతకు వచ్చినట్లుగా భక్తులు భావించి మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ చైర్మన్ జగన్‌మోహన్‌రెడ్డి మాట్లాడుతూ.. దత్త జయంతిని పురస్కరించుకుని ఈనెల 25న సాయిపారాయణ ముగింపు కార్యక్రమాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. పట్టణంలోని ప్రధాన వీధుల గుండా సాయి రథాన్ని ఊరేగించనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో సాయి దీక్ష సేవా సమితి సభ్యులు పూదరి నరహరి, ఉప్పుల నందు, శ్రీను, ప్రకాశ్‌గౌడ్, శంకర్, హరి, లింగారెడ్డి, నారాయణరెడ్డి, రేఖ తదితరులు పాల్గొన్నారు.

రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం

నిర్మల్‌చైన్‌గేట్: లోక్‌సభ ఎన్నికల ఖర్చుల గురించి వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో శుక్రవారం కలెక్టరేట్ మినీ సమావేశ మందిరంలో కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ సమావేశం నిర్వహించారు. ఎన్నికల ప్రచారంలో వినియోగించే వస్తువుల ధరలు ప్రస్తుత మార్కెట్ విలువను పరిగణనలోకి తీసుకుని రేట్ చార్ట్ నిర్ణయించినట్లు చెప్పారు. సమావేశంలో అదనపు కలెక్టర్ కిశోర్‌కుమార్, వివిధ పార్టీల నాయకులు శ్రావణ్‌రెడ్డి, గాజుల రవి, మజార్, సయ్యద్ హైదర్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

అటవీ అధికారులకు జింక అప్పగింత


జింకను అప్పగిస్తున్న పోలీసులు

తానూరు: గాయాల పాలైన జింకను శుక్రవారం అటవీ శాఖ అధికారులకు అప్పగించినట్లు ఏఎస్సై నిర్సింగ్ బాను తెలిపారు. కోలూరుతాండ శివారు ప్రాంతంలో జింకపై కుక్కలు దాడి చేయడంతో గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు పోలీస్ స్టేషన్‌లో అప్పగించారు. పోలీసులు అటవీ శాఖ అధికారుల సమాచారం అందించి వారికి జింకను అప్పగించారు. బాసరకు తరలించి ప్రథమ చికిత్స అందిస్తామని అటవీశాఖ అధికారులు పేర్కొన్నారు.

పీవోను కలిసిన ఆర్టీసీ డీఎం


పీవోకు మొక్క అందిస్తున్న డీఎం

ఉట్నూర్‌రూరల్(ఖానాపూర్): ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి చాహత్ బాజ్‌పాయ్‌ని శుక్రవారం ఆదిలాబాద్ ఆర్టీసీ డిపో మేనేజర్ కల్పన మర్యాద పూర్వకంగా కలిసి పూలమొక్క అందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ డ్రైవింగ్‌పై ఆసక్తి గల అభ్యర్థులకు టీఎస్‌ఆర్టీసీ ఆదిలాబాద్ డిపోలో హెవీ వెహికిల్ డ్రైవింగ్ శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ఆమె పేర్కొన్నారు.

మేధో విభాగం రాష్ట్ర కోఆర్డినేటర్‌గా 'తుల'


తుల అరుణ్‌కుమార్

బోథ్: తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ మేధోవిభాగం(విచార్ విభాగ్) రాష్ట్ర కో ఆర్డినేటర్‌గా సొనాల గ్రామానికి చెందిన తుల అరుణ్ కుమార్‌ను నియమించారు. ఈ మేరకు అఖిల భారత కాంగ్రెస్ కమిటీ విచార్ విభాగ్ చైర్‌పర్సన్ గిరిజవ్యాస్ నియామకపత్రం అందజేశారు. తుల అరుణ్ కుమార్ మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేసి వచ్చే ఎన్నికల్లో వంద సీట్లు సాధించే దిశగా కసరత్తు చేస్తామన్నారు.

అసిస్టెంట్ ఎడిటర్‌గా రాణిస్తున్న విష్ణు


విష్ణు

కడెం(ఖానాపూర్): కడెంకు చెందిన యువకుడు సినిమా రంగంలో అసిస్టెంట్ ఎడిటర్‌గా రాణిస్తున్నాడు. మండల కేంద్రానికి చెందిన రామగిరి లత-శ్రీనివాస్ దంపతుల కుమారుడు రామగిరి విష్ణు ఇటీవల విడుదలైన యంగ్ రెబల్ స్టార్ ప్రభాస్ హీరోగా నటించిన 'సలార్' సినిమాకు అసిస్టెంట్ ఎడిటర్‌గా పని చేశాడు. త్వరలో రాబోయే..మ్యాడ్ తెలుగు, గ్యాంగ్ ఆఫ్ గోదావరి, లక్కీ భాస్కర్ చిత్రాలకు సైతం అసిస్టెంట్ ఎడిటర్‌గా పనిచేస్తున్నాడు. కుటుంబ సభ్యులు, మిత్రులు హర్షం వ్యక్తం చేస్తూ శుభాకాంక్షలు తెలిపారు.

సాక్షి క్లాసిఫైడ్స్

SERVICES

■ రుణాలు, వ్యక్తిగత, వ్యవసాయం, వ్యాపార రుణం, తక్కువ వడ్డీ, సిబిల్ అవసరం లేదు, NPA కూడా ధరఖాస్తు చేసుకోవచ్చు. సిటీకాపిటల్ సర్వీస్, విష్ణు,87690 57367. [T-223]

WANTED

■ హరేకృష్ణ హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్ / నర్సులు కావలెను. ఫ్రీ వసతి + భోజనం. జీ: 18K. Ph: 9640258899/ 9640468899 [H-793665]

■ మా ఆఫీసు న్యూ ఫ్రాంచేజీ ద్వారా మీ ఖాళీ సమయంలో పార్ట్ టైమ్ / ఫుల్ టైమ్‌గా వర్క్ చేస్తూ 15వేలు ఆపైన సంపాదించే అవకాశం. 9849933042, 9177736926. [M-1167561]

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

For Classifieds, Advertisements Contact:
9951602888
9010299065
9951602823
9010608462

అట్టహాసంగా సాఫ్ట్‌బాల్ పోటీలు

- ప్రారంభించిన నిర్మల్ కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్
- 10 ఉమ్మడి జిల్లాల నుంచి 340 మంది క్రీడాకారులు హాజరు


సాఫ్ట్‌బాల్ పోటీలు ప్రారంభిస్తున్న కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్


సాఫ్ట్‌బాల్ ఆడుతున్న బాలికల జట్టు


సాఫ్ట్‌బాల్ ఆడుతున్న బాలుర జట్టు

నిర్మల్‌టౌన్: జిల్లా కేంద్రంలోని ఎన్టీఆర్ మినీ స్టేడియంలో రాష్ట్రస్థాయి అండర్-17 బాలబాలికల సాఫ్ట్‌బాల్ పోటీలు శుక్రవారం అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 22, 23 తేదీల్లో నిర్వహిస్తున్న పోటీలను నిర్మల్ జిల్లా కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్ జెండా ఊపి ప్రారంభించారు. ఎస్‌జీఎఫ్ జిల్లా సెక్రటరీ రమణారావు నేతృత్వంలో నిర్వహిస్తున్న పోటీల్లో ఉమ్మడి 10 జిల్లాల నుంచి మొత్తం 340 మంది క్రీడాకారులు, 20 మంది కోచ్‌లు, 20 మంది సబ్ కోచ్‌లు పాల్గొన్నారు. మొదటిరోజు నిర్వహించిన పోటీల్లో కరీంనగర్ బాలుర జట్టుపై నిజామాబాద్, హైదరాబాద్ జట్టుపై ఆదిలాబాద్, నల్గొండ జట్టుపై ఖమ్మం జట్లు విజయం సాధించాయి. కరీంనగర్ బాలికల జట్టుపై వరంగల్, రంగారెడ్డి జట్టుపై మెదక్, నల్గొండ జట్టుపై నిజామాబాద్ జట్లు విజయం సాధించాయి. ఈ పోటీల్లో ప్రతిభ కనబర్చిన క్రీడాకారులు రాజస్థాన్‌లోని బికనూర్‌లో జనవరి 11 నుండి 15 వరకు జరగనున్న జాతీయస్థాయి పోటీల్లో పాల్గొంటారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ఈశ్వర్, జిల్లా విద్యాశాఖ ఇన్‌చార్జి అధికారి పద్మ, జిల్లా యువజన క్రీడల అధికారి నాపేఖాన్, పేట సెక్రటరీ భోజన్న, సాఫ్ట్ బాల్ సెక్రటరీ అన్నపూర్ణ, పీఈటీలు భూమన్న, రామారావు, జమున, తదితరులు పాల్గొన్నారు.

నిర్మల్‌లో నిర్వహించడం సంతోషంగా ఉంది

నిర్మల్ జిల్లాలో రాష్ట్రస్థాయి పోటీలు జరగడం చాలా సంతోషాన్నిచ్చింది. పోటీల్లో పాల్గొనడానికి ఉమ్మడి పది జిల్లాల నుంచి వచ్చిన క్రీడాకారులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని వసతులు కల్పించాం. క్రీడాకారులు రాష్ట్రస్థాయి పోటీల్లో పట్టుదలతో ఆడి జాతీయస్థాయి పోటీలకు ఎంపిక కావాలి.

– ఆశీష్ సంగ్వాన్, నిర్మల్ కలెక్టర్

క్రీడలు అంటే ఇష్టం



నాకు చిన్నప్పటి నుంచి క్రీడలు అంటే ఎంతో ఇష్టం. నాలుగో తరగతి నుంచి సాఫ్ట్‌బాల్‌లో మెలకువలు నేర్చుకున్నా. ఇప్పుడు తొమ్మిదో తరగతి. ఇప్పటి వరకు ఒకసారి రాష్ట్రస్థాయి, రెండుసార్లు జాతీయస్థాయి పోటీల్లో పాల్గొన్నా. జాతీయస్థాయి పోటీలకు ఎంపికై ప్రతిభ కనబర్చి ముందుకెళ్లాలని కోరిక.

– ఏ.జయశ్రీ, మెదక్ జట్టు

జాతీయస్థాయికి ఎంపికవుతా



రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రతిభ కనబరిచి జాతీయస్థాయికి ఎంపికవుతా. ఇప్పటివరకు మూడుసార్లు రాష్ట్రస్థాయి పోటీలలో పాల్గొన్నా. జాతీయస్థాయిలో పాల్గొనాలనేది నా లక్ష్యం. గుర్తింపు పొందాలనేదే నా కల.

– సోనాలిక, ఆదిలాబాద్ జట్టు

తల్లిదండ్రుల ప్రోత్సాహంతో..



మా తల్లిదండ్రుల ప్రోత్సాహంతో కష్టపడి ముందుకెళ్తున్నా. సంవత్సరం ముందు నుంచి సాఫ్ట్‌బాల్ నేర్చుకున్నా. రెండుసార్లు రాష్ట్రస్థాయి పోటీలలో పాల్గొన్నా. జాతీయ స్థాయికి ఎంపికై ఉత్తమ ప్రతిభ కనబరచాలన్నదే నా లక్ష్యం.

– లోకేశ్, హైదరాబాద్ జట్టు

కోచ్‌గా గుర్తింపు పొందాలి



మూడేళ్లుగా కరీంనగర్ విద్యార్థులకు సాఫ్ట్‌బాల్ కోచింగ్ ఇస్తున్నా. ఇప్పటి వరకు నా వద్ద కోచింగ్ తీసుకున్న 13 మంది క్రీడాకారులు రాష్ట్రస్థాయిలో ఆడారు. మంచి కోచ్‌గా మంచి గుర్తింపు పొందాలన్నదే నా లక్ష్యం.

– గంగాధర్, కరీంనగర్ జట్టు కోచ్

జిల్లాకు పేరు వస్తుంది



నిర్మల్ పట్టణంలో నిర్వహించే రాష్ట్రస్థాయి సాఫ్ట్ బాల్ పోటీలకు అన్ని రకాల వసతులు కల్పించాం. 10 ఉమ్మడి జిల్లాల నుంచి 20 జట్లు ఇక్కడికి వచ్చాయి. ఈ పోటీలు ఇక్కడ నిర్వహించడంతో నిర్మల్ జిల్లాకు ఎంతో పేరు వస్తుంది.

– రమణారావు, ఎస్‌జీఎఫ్ సెక్రటరీ

క్రీడల్లో రాణిస్తే ఉజ్వల భవిష్యత్తు

రెబ్బెన(ఆసిఫాబాద్): విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లోనూ రాణిస్తే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని ప్రముఖ సినీ నటుడు నాజర్ అన్నారు. శనివారం నుంచి 25వ తేదీ వరకు హైదరాబాద్‌లోని హెచ్ఏఎల్ గ్రౌండ్స్‌లో జరగనున్న రాష్ట్రస్థాయి బాల్‌బ్యాడ్మింటన్ పోటీల్లో పాల్గొనే ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా పురుషులు, మహిళల జట్లను శుక్రవారం ఎంపిక చేశారు. నాజర్ మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే క్రీడలపై దృష్టి సారించాలని సూచించారు. క్రీడాకారుల జాబితాను ఉమ్మడి జిల్లా బాల్‌బ్యాడ్మింటన్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి నారాయణరెడ్డి ప్రకటించారు. కార్యక్రమంలో సంయుక్త కార్యదర్శి ఎస్.తిరుపతి, పీఈటీ భాస్కర్, షార్ప్ స్టార్ బాల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ అధ్యక్షుడు మహేందర్ రెడ్డి, కోశాధికారి శంకర్, ప్రధాన కార్యదర్శి వెంకటేశ్వర్లు, సీనియర్ క్రీడాకారుడు మల్లేశ్ పాల్గొన్నారు.


రాష్ట్రస్థాయికి ఎంపికైన ఉమ్మడి జిల్లా జట్లు

ఎంపికైన క్రీడాకారులు

ఉమ్మడి జిల్లా పురుషుల జట్టుకు శ్రావణ్, తిరుపతి, సిద్దార్థ రాజ్, పవన్, తరుణ్, నరేశ్, సూర్య, శ్రీకాంత్, సాయిచరణ్, గోపాల్ ఎంపిక కాగా.. స్టాండ్‌బైగా దిలీప్, దేవరాజ్‌లు ఎంపికయ్యారు. మహిళల జట్టుకు స్వప్న, అంజలి, శ్రీవిద్య, శ్రావణి, విష్ణుప్రియ, శ్రీస్ఫూర్తి కారుణ ప్రజ్వలశ్రీ, అస్మిత, నవ్య, లక్ష్మితోపాటు కోచ్‌గా శృతిని ఎంపిక చేశారు.

జాతీయస్థాయి పోటీలో విద్యార్థి ప్రతిభ

ఉట్నూర్‌రూరల్(ఖానాపూర్): ఈ నెల 16 నుండి 20 వరకు ఉత్తరప్రదేశ్‌లోని లక్నోలో నిర్వహించిన 67వ జాతీయస్థాయి 4/100 పరుగు పందెం పోటీల్లో స్థానిక ట్రైబల్ వెల్ఫేర్ ఆదర్శ పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతున్న విద్యార్థి రాథోడ్ విక్రం ప్రతిభ కనబరిచాడు. శుక్రవారం పాఠశాల ప్రధానోపాధ్యాయులు రాథోడ్ ఉత్తం, ఫిజికల్ డైరెక్టర్ హేమంత్ కుమార్, ఉపాధ్యాయులు ఉపేందర్, మనోజ్ కుమార్, మాధవరావు, జావేందర్, శ్యాంరావు, బలిరాం, కాశీరాం, మహేందర్ విద్యార్థిని సన్మానించారు.


విద్యార్థిని అభినందిస్తున్న అధ్యాపకులు

విద్యార్థులు ఇష్టపడి చదవాలి

విద్యార్థులు కష్టపడి కాకుండా ఇష్టంతో చదవాలని, అప్పుడే అనుకున్న లక్ష్యం చేరుకుంటామని ఆర్సీవో గంగాధర్ అన్నారు. స్థానిక ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాలలో గణిత దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఉపాధ్యాయులు ప్రదీప్, ఉమేశ్, నరేశ్, తదితరులు పాల్గొన్నారు.

ప్రజాసమస్యల పరిష్కారానికి పోరాటం

- సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు నళినీరెడ్డి

ఎదులాపురం: ప్రజా సమస్యల పరిష్కారానికి సీపీఐ 98 ఏళ్లుగా నిర్విరామంగా పోరాడుతోందని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు ముడుపు నళినీరెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని రాంనగర్‌లో శుక్రవారం పార్టీ 99వ ఆవిర్భావ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ భారత కమ్యూనిస్టు పార్టీకి గణనీయమైన చరిత్ర ఉందన్నారు. 1925 డిసెంబర్ 26న కాన్పూర్‌లో ఆవిర్భవించిందన్నారు. పేద ప్రజల పక్షాన నిలబడుతూ హక్కులు సాధించిన ఘనత సీపీఐకే దక్కుతుందన్నారు. కార్యక్రమంలో నాయకులు కండ్యాల గణేశ్, రామగిరి హరికిషన్, సుఖ్‌దేవ్, పద్మ, స్వప్న, చందు, శంకర్, గంగమ్మ, గిరి, దత్తు, పోచ్చిరామ్, తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ముడుపు నళినీరెడ్డి

నేడు ఎస్టీయూ ఆధ్వర్యంలో సమావేశం

నిర్మల్‌రూరల్: ప్రభుత్వ పాఠశాలల్లో అమలవుతున్న తొలిమెట్టు, ఉన్నతి కార్యక్రమాల అమలుపై చర్చించేందుకు శనివారం నిర్మల్‌లోని సంఘ భవనంలో సాయంత్రం ఐదు గంటలకు రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎస్టీయూ సంఘ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు భూమన్న యాదవ్, జె.లక్ష్మణ్ ఒక ప్రకటనలో తెలిపారు. సమావేశానికి సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పర్వత్‌రెడ్డి, జి.సదానందం గౌడ్ హాజరవుతారన్నారు. జిల్లాలోని అన్ని పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, కాంప్లెక్స్, ఎంఈవోలు, తొలిమెట్టు నోడల్ అధికారులు, ఉపాధ్యాయ అవార్డు గ్రహీతలు, విద్యావేత్తలు, వచ్చి విజయవంతం చేయాలని కోరారు.

రేపు డయాలసిస్ సేవలు ప్రారంభం

భైంసాటౌన్: భైంసాలోని ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో 'డయాలసిస్ సేవలు ఎప్పుడో' శీర్షికన 'సాక్షి'లో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. ఆదివారం నుంచి ఆస్పత్రిలో డయాలసిస్ సేవలు ప్రారంభించనున్నట్లు సూపరింటెండెంట్ కాశీనాథ్ తెలిపారు. శుక్రవారం కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్‌ను కలిసి ఈ విషయమై వివరించినట్లు పేర్కొన్నారు. భైంసా పరిధిలో 25మంది డయాలిసిస్ రోగులున్నట్లు గుర్తించామని తెలిపారు. ఎమ్మెల్యే రామారావుపటేల్ చేతుల మీదుగా సేవలు ప్రారంభించనున్నట్లు పేర్కొన్నారు.

ఆకస్మిక తనిఖీ


ఎక్బాల్‌పూర్‌లో అంగన్‌వాడీ కేంద్రంలో..

ఖానాపూర్: ఎక్బాల్‌పూర్, తర్లపాడ్ గ్రామాల్లో శుక్రవారం జిల్లా ప్రణాళిక అధికారి మల్లికార్జున్ ఆకస్మికంగా పర్యటించారు. అంగన్‌వాడీ కేంద్రాలు, ప్రభుత్వ పాఠశాలలను సందర్శించారు. విద్యార్థులు, ఉపాధ్యాయుల హాజరు, మధ్యాహ్న భోజన నిర్వహణ వివరాలు తెలుసుకున్నారు. నర్సరీలు, అవెన్యూ ప్లాంటేషన్లను పరిశీలించారు. ఎంపీవో చంద్రశేఖర్, ఐసీడీఎస్ సూపర్ వైజర్లు శ్రీలత, నిర్మల, నాయకుడు పెద్ది నర్సయ్య ఉన్నారు.

అక్రమ నిర్మాణాల తొలగింపు

నిర్మల్‌టౌన్: జిల్లా కేంద్రంలోని ప్రియదర్శినినగర్ ఎన్టీఆర్ మార్గంలో చేపట్టిన అక్రమ నిర్మాణాలను శుక్రవారం మున్సిపల్ అధికారులు జేసీబీ సహాయంతో తొలగింపజేశారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ రాజు మాట్లాడుతూ అక్రమ నిర్మాణాలు చేపడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. లేక్ కమిటీ ఫిర్యాదు మేరకు ఈ కట్టడాన్ని పోలీస్ భద్రత మధ్య తొలగించినట్లు ఆయన పేర్కొన్నారు. టౌన్ ప్లానింగ్ నుంచి ఎలాంటి అనుమతులు, నెట్ బ్యాక్‌లు లేకుండా భవనాలు నిర్మించవద్దని సూచించారు. టీపీవో సుమలత, మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.


జేసీబీతో తొలగిస్తున్న అధికారులు

వైద్యశిబిరాల్లో గిరిజనులకు మెరుగైన వైద్యం

- ఐటీడీఏ పీవో చాహత్ బాజ్‌పాయ్


వైద్యులతో మాట్లాడుతున్న ఐటీడీఏ పీవో

నార్నూర్: ఏజెన్సీ ప్రాంతాల్లోని మారుమూల గ్రామాల్లో నివాసం ఉంటున్న గిరిజనులకు మెరుగైన వైద్యం అందించేందుకే 'హెల్త్ టూ హోమ్' పేరుతో ప్రత్యేక వైద్యశిబిరాలు నిర్వహిస్తున్నామని ఐటీడీఏ పీవో చాహత్ బాజ్‌పాయ్ అన్నారు. శుక్రవారం మండలంలోని బాబేఝరిలో నిర్వహించిన వైద్యశిబిరాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఐటీడీఏ ద్వారా ప్రత్యేక మొబైల్ వాహనం, ప్రత్యేక వైద్యబృందాన్ని ఏర్పాటు చేశామన్నారు. ఎలాంటి ఆరోగ్య సమస్యలు ఉన్నా వైద్యం చేయించుకోవాలని గిరిజనులను కోరారు. ప్రతి గ్రామంలో ఆశ కార్యకర్తలు, అంగన్‌వాడీ టీచర్లతో అవగాహన కల్పించాలన్నారు. వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకునేలా చూడాలని అధికారులను ఆదేశించారు. ఏజెన్సీ జిల్లా అదనపు వైద్యాధికారి కుమ్ర బాలు, వైద్యులు సంజీవ్, మేఘన, రవుఫ్, రాజమణి, సీహెచ్‌వో రాథోడ్ తులసిదాస్, లక్ష్మి, హెచ్ఈవో శిరిష్, హెచ్ఎస్ చరణ్‌దాస్, పంచాయతీ కార్యదర్శి విజయ్, సిబ్బంది ఈశ్వర్, హిమబిందు, గోకుల్, బాపురావు, ఈశ్వరి, తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర పథకాలు సద్వినియోగం చేసుకోవాలి

- కేంద్ర పంచాయతీరాజ్ డైరెక్టర్ రమిత్ మౌర్య


మాట్లాడుతున్న రమిత్ మౌర్య

తాంసి(బోథ్): కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెడుతున్న వివిధ సంక్షేమ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కేంద్ర పంచాయతీరాజ్ శాఖ డైరెక్టర్ రమిత్ మౌర్య కోరారు. వికసిత్ భారత్ సంకల్ప్ యాత్రలో భాగంగా శుక్రవారం తాంసి మండల కేంద్రంలో ఉన్నతాధికారులతో కలిసి గ్రామస్తులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. గ్రామస్తులతో కలిసి కేంద్ర పథకాలకు సంబంధించిన పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతీ మారుమూల గ్రామాల ప్రజలకు పథకాల ప్రయోజనం అందించాలనే లక్ష్యంతో కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో డ్వామా పీడీ కిషన్, సర్పంచ్ స్వప్న, డీఎస్ఓ కిరణ్ కుమార్, డీఎంహెచ్‌వో నరేందర్ రాథోడ్, లీడ్ బ్యాంక్ మేనేజర్ శ్రీధర్‌బాబు, కేవీకే శాస్త్రవేత్త రాజశేఖర్, ఏవో రవీందర్, వికసిత్ కమిటీ సభ్యులు సంతోష్‌రెడ్డి, ఏఈవో నిఖిత, తదితరులు పాల్గొన్నారు.

ట్రిపుల్‌ఐటీలో రామానుజన్ జయంతి


వేడుకల్లో పాల్గొన్న వీసీ వెంకటరమణ

భైంసా(ముధోల్): గణిత మేధావి రామానుజన్ 137వ జయంతి వేడుకలను శుక్రవారం బాసర ట్రిపుల్‌ఐటీలో ఘనంగా నిర్వహించారు. పరిపాలన భవనంలోని కాన్ఫరెన్స్ హాల్‌లో వీసీ ప్రొఫెసర్ వెంకటరమణతో పాటు అధ్యాపకులు రామానుజన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. భారతీయ గణిత మేధావి శ్రీనివాస రామానుజన్ అని వీసీ కొనియాడారు. ఉత్తమ ఇంజనీరింగ్ విద్యార్థిగా రాణించాలంటే గణిత శాస్త్రంపై పట్టు ఉండాలన్నారు. గణితశాస్త్రానికి, సాంకేతిక విద్యకు దగ్గరి సంబంధం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో మ్యాథమెటిక్స్ డిపార్ట్‌మెంట్ హెచ్‌వోడీ ఆడెపు మధుసూదన్, డా. పావని, సృజన, డా.దత్తు, తదితరులు పాల్గొన్నారు.

బస్సుల్లో ప్రయాణికుల రద్దీ


బస్సు రావడంతో ఎక్కేందుకు ఎగబడుతున్న జనం


బస్సుల కోసం నిరీక్షిస్తున్న ప్రయాణికులు

- రద్దీకి అనుగుణంగా పెరగని సర్వీసులు
- గురువారం ఒక్కరోజే భైంసాలో 130 ఓఆర్ శాతం

భైంసాటౌన్(ముధోల్): కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన మహాలక్ష్మి పథకంతో ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణికుల రద్దీ పెరిగింది. బస్సులన్నీ దాదాపు ప్రయాణికులతో కిటకిటలాడుతున్నాయి. బస్టాండ్ ప్రాంగణం సైతం రద్దీతో కిక్కిరిసి కనిపిస్తోంది. మహిళలకు బస్సుల్లో ఉచిత ప్రయాణం నేపథ్యంలో బస్సుల కోసం వేచి చూస్తున్నారే తప్ప ఇతర వాహనాలను ఆశ్రయించడం లేదు. ఫలితంగా బస్టాండ్‌లో జనసందోహం కనిపిస్తోంది. ఇదిలా ఉండగా, భైంసా ఆర్టీసీ డిపో పరిధిలో 73 సర్వీసులు నడుపుతుండగా, గతంలో 60-70 శాతం మాత్రమే ప్రయాణికుల రద్దీ ఉండేది. మహాలక్ష్మి పథకం అమలు నేపథ్యంలో 80-90 శాతానికి పెరిగింది. భైంసా ఆర్టీసీ డిపోలో గురువారం ఒక్కరోజే 91శాతం ఓఆర్ నమోదైంది. ఇక శుక్రవారం సైతం భైంసా ఆర్టీసీ బస్టాండ్‌లో విపరీతమైన రద్దీ నెలకొంది. బస్సులు సకాలంలో లేకపోవడంతో ప్రయాణికులు బస్సుల కోసం నిరీక్షిస్తూ కనిపించారు. బస్సు రావడంతో సీట్ల కోసం ఒక్కసారిగా ఎగబడ్డారు. దీంతో మహిళలు, వృద్ధులు ఇబ్బందులు పడ్డారు. పెరిగిన ప్రయాణికుల రద్దీకి అనుగుణంగా బస్సు సర్వీసులు పెంచాలని ప్రయాణికులు కోరుతున్నారు.

రుణాలతో ఆర్థికంగా ఎదగాలి

తానూరు: ఖాతాదారులు తీసుకున్న రుణాలను సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా ఎదగాలని టీజీబీ ఆర్ఎం రామారావు అన్నారు. శుక్రవారం మండలకేంద్రంలోని తెలంగాణ గ్రామీణ బ్యాంక్‌లో ఖాతాదారులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. విద్య, వ్యాపార, వాహన, గృహ నిర్మాణంతోపాటు స్వయం సహాయక సంఘాలకు రుణాలు అందిస్తున్నట్లు పేర్కొన్నారు. తానూరు బ్యాంక్‌లో రూ.103 కోట్ల లావాదేవీలు చేపట్టినందుకు సిబ్బందిని అభినందించారు. తానూరు బ్యాంక్‌లో రూ.వెయ్యి చెల్లించి ప్రమాద బీమా తీసుకున్న జింకల్‌కర్ గంగాధర్ ప్రమాదవశాత్తు మృతి చెందాడు. ఆయన పేరిట మంజూరైన రూ.20 లక్షల బీమా చెక్కును ఆయన భార్య సాగరాబాయి, కుటుంబీకులకు అందించారు. కార్యక్రమంలో బ్యాంక్ మేనేజర్ పి.సుధాకర్‌కుమార్, ఫీల్డ్ ఆఫీసర్ కార్తీక్, సిబ్బంది రాకేశ్, గంగరాజన్ ,శ్రీనివాసులు, లక్ష్మణ్, రాజు, శ్రీకాంత్, నారాయణ్, సర్పంచ్ విఠల్, పండరి, శివాజీపటేల్ పాల్గొన్నారు.


చెక్కు అందిస్తున్న ఆర్ఎం, బ్యాంక్ సిబ్బంది

ఉపాధ్యాయుడిపై చర్యలు తీసుకోండి..

- కలెక్టర్‌కు చైల్డ్‌రైట్ ప్రొటెక్షన్ కమిషన్ రాష్ట్ర కార్యదర్శి ఆదేశం

ఆదిలాబాద్‌టౌన్: నేరడిగొండలోని ప్రభుత్వ పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయుడు తమను వేధిస్తున్నాడని విద్యార్థులు ఇటీవల ఆందోళన చేపట్టిన విషయం తెలిసిందే. ఇప్పటికే చర్యల్లో భాగంగా డీఈవో ఆయనపై సస్పెన్షన్ వేటు వేశారు. ఐసీపీఎస్ అధికారులు సైతం విచారణ జరిపి సీడబ్ల్యూసీకి నివేదిక సమర్పించారు. విద్యార్థుల ద్వారా లిఖితపూర్వకంగా రాయించుకొని నేరడిగొండ స్టేషన్‌లో సదరు ఉపాధ్యాయుడిపై ఫిర్యాదు చేశారు. ఇదిలా ఉండగా తాజాగా చైల్డ్‌రైట్ ప్రొటెక్షన్ కమిషన్ రాష్ట్ర కార్యదర్శి ఎన్‌కె స్వరూపరాణి సదరు ఉపాధ్యాయుడిపై విచారణ చేపట్టి చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌తో పాటు డీఈవోకు ఆదేశాలు జారీ చేశారు. విచారణకు సంబంధించిన నివేదిక సమర్పించాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

అటవీశాఖ కార్యాలయం ఎదుట ఆందోళన

నేరడిగొండ(బోథ్): తమ కళాశాలలో మరుగుదొడ్ల నిర్మాణానికి అనుమతి ఇవ్వాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం కళాశాల విద్యార్థులు అటవీ శాఖ కార్యాలయం ఎదుట ఆందోళన చేపట్టారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలకు ఇంటర్ బోర్డ్ ద్వారా మరుగుదొడ్ల నిర్మాణానికి మంజూరైన రూ.9.20 లక్షలతో కళాశాల ఆవరణలో ఇటీవల ఎమ్మెల్యే అనిల్ జాదవ్ భూమి పూజ చేశారు. అటవీ శాఖ అధికారులు నిర్మాణ పనులను నిలిపివేశారు. దీనిని నిరసిస్తూ స్థానిక అటవీ శాఖ రేంజ్ కార్యాలయం ఎదుట ఆందోళనకు దిగారు. కళాశాల ప్రిన్సిపాల్ శబానతరన్నమ్ మాట్లాడుతూ 22 ఏళ్ల క్రితం 2 ఎకరాల 18 గుంటల ఆర్ఓఎఫ్ఆర్ భూమిని కళాశాల నిర్మాణం కోసం కేటాయించారని, దానికి సంబంధించిన భూ పత్రాలు కూడా తమ వద్ద ఉన్నాయన్నారు. గతంలో కూడా కళాశాలకు అదనపు గదులు మంజూరు కాగా అప్పుడు కూడా అటవీ శాఖ అధికారుల వల్ల అవి కట్టలేకపోయామన్నారు. ఇప్పుడు కూడా మరుగుదొడ్ల నిర్మాణ పనులను నిలిపివేశారన్నారు. అనంతరం డెప్యూటీ రేంజ్ అధికారి సవితకు వినతిపత్రం అందజేశారు.


వినతిపత్రం ఇస్తున్న లెక్చరర్లు, విద్యార్థులు